

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

దేశంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతాం

- ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయాన్ని, ఉపాధి రంగాన్ని, పరిశ్రమలు, ఐటిని అగ్రగామిగా నిలపడానికి కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తామని, దేశంలో తెలంగాణను ఆదర్శంగా నిలుపుతామని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఆయన తన నియోజకవర్గానికి వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛను కల్పించాలనేది సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కక్ష సాధింపులు ఉండవని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు మేలుగా ఉన్నాయనుకుంటే వాటిని కొనసాగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో తాము చెప్పిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆటో కార్మికులకు తమ ప్రభుత్వం సంపూర్ణంగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేసి.. జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సిద్దిపేట, ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రులుగా దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ ఉన్నారని, వారి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.



కర్ణాటక బ్యాంకు ఆధ్వర్యంలో వాకథాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక బ్యాంకు శతాబ్ది సంవత్సరం సందర్భంగా ఎపి, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం వాకథాన్ నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం నుంచి కెబిఆర్ పార్కు వరకు జరిగిన వాకథాన్‌ను కర్ణాటక బ్యాంకు ప్రాంతీయ ప్రధాన కార్యనిర్వాహక కెఎల్ శేషాద్రి, బజాజ్ అలియన్జ్ ప్రాంతీయ అధికారి అనీల్ జెండా ఊపి ప్రారంభించారు. బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, ఖాతాదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రధాన కార్యనిర్వాహక కార్యదర్శి కెఎల్ శేషాద్రి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీపై అవగహన కల్పించారు.



మేడిగడ్డపై పూర్తి వివరాలివ్వండి...

- అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం తన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నీటిపారుదల రంగం పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల ఖర్చులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలన్నారు. ఇతర రాష్ట్రాలతో జల వివాదాలకు సంబంధించి కృష్ణా ట్రిబ్యునల్ వద్ద వినిపించాల్సిన వాదనలు, ముమ్ముందు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. అంతర్రాష్ట్ర జలవివాదాలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు సీఎం. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్ సీ మురళీధర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి భట్టిని కలిసిన ఎపి ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎపికి చెందిన మంత్రి కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరు రాష్ట్రాల మధ్య నేలకొన్న వివాదాలు, విభజన సమస్యలు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్టు సమాచారం.

రేవంత్ మార్కు పాలన

- పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీ
- సీనియర్ ఐఎఎస్ అర్వింద్ లూప్‌లైన్
- దానకిషోర్‌కు పురపాలక బాధ్యతలు
- హైదరాబాద్ రేంజ్ ఐపిఎస్‌లకు స్థానచలం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొలువుతీరిన కొత్త ప్రభుత్వం సిఎం రేవంత్ మార్క్ పాలనకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో కీరోల్ పోషించిన సీనియర్ ఐఎఎస్‌లను బదిలీ చేసింది. హైదరాబాద్ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఐపిఎస్‌లనూ మార్చింది. ఈమేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది.

పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అర్వింద్ కుమార్‌ను విపత్తు నిర్వహణశాఖకు, బిసి వెల్ఫేర్ కార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి. కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. జల మండలి ఎండిగా ఉన్న దానకిషోర్‌ను పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి, హెచ్‌ఎండిఎ, సిబిఎంఎ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా ఉన్న సుదర్శన్ రెడ్డిని జలమండలి ఎండిగా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న క్రిస్టినా జెడ్ చాంగ్‌ను వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిగా, ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శిగా కెఎస్ శ్రీనివాసరాజును నియమించారు. సిఎం కార్యదర్శిగా ఉన్న రాహుల్ బొజ్జాను జిఎడి కార్యదర్శిగా, నియమించడంతో పాటు ఎస్సీ అభివద్ధిశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న వాణి ప్రసాద్‌ను అటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి, ఇపిటిఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శిగా వాకాటి కరుణ, వాణిజ్య పన్నులశాఖ కమిషనం ్గా టీకే.శ్రీదేవిని నియమించారు. నల్గొండ కలెక్టర్‌గా ఉన్న ఆర్వీ కర్ణన్‌ను వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా నియమించారు.

తొలివిడతగా ఐపిఎస్‌లు బదిలీలు జరిగాయి. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సిపిగా విశ్వప్రసాద్.

సిట్, క్రైమ్ జాయింట్ సిపిగా ఎవి రంగనాథ్, హైదరాబాద్ పశ్చిమమండలం డిసిపిగా ఎస్.ఎం. విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డిసిపిగా జోయల్ డేవిస్ హైదరాబాద్ ఉత్తర మండలం డిసిపిగా రోహిణి ప్రియదర్శిని, సిసిఎస్ డిసిపిగా ఎన్ శ్వేత, హైదరాబాద్ ట్రాఫిక్-1డిసిపిగా ఎస్.సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ డిసిపిగా ఉన్న నితికపంత్, సిసిఎస్‌లో జాయింట్ సిపిగా ఉన్న గజరావ్ భూపాల్, ఉత్తర మండల డిసిపిగా ఉన్న చందనా దీప్తిని డిజిపి కార్యాలయానికి అటాచ్ చేశారు. వీరి తో పాటు మరో ఐదుగురు నాన్ కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోం శాఖ కార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీచేశారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

త్యాగరాయ గానసభలో జాతీయ పింఛన్ దారుల దినోత్సవం

ప్రజాశక్తి-కల్చరల్

జాతీయ పింఛన్‌దారుల దినోత్సవం ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నళినిమోహన్, బుచ్చిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వి.వి. జనార్ధనరావు, సలహాదారులు కెఎస్ఆర్, ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్రనాథ్, పి.ఉషారాణిరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్య శర్మ, రఘునాథ్, కె.విశ్వేశ్వరరావు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంఘంలో 80 సంవత్సరాలు దాటిన పెన్షన్‌దారులను సత్కరించి అభినందించారు. ఇదే సభలో 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తొలుత పెన్షన్ కోసం పోరాడిన డిఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింఛన్‌దారులు, వయోవద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను వక్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ములుగు ప్రజలకు సేవకురాలిగా ఉంటా

- ఇక్కడి నుండే పాలన కొనసాగిస్తా.
- ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు ఆడబిడ్డగా ఆదరించి ఆశీర్వదించిన ములుగు నియోజకవర్గ ప్రజలకు సేవకురాలిగా ఉంటానని పంచాయతీ రాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు ములుగు ఎస్‌పి గౌస్ ఆలం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మంత్రి సీతక్కకు గౌస్‌పల్లి, మల్లంపల్లి, భూపాల్‌నగర్, జాకారం గ్రామాల్లో మహిళలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి గట్టమ్మ దగ్గరికి చేరుకొని తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ములుగుకు చేరుకొని చౌరస్తాలో మంత్రి సీతక్క మాట్లాడారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు రంగు, రంగుల గోడలు కాదని, ప్రతి ఒక్క పేదవారి నైతిక అభివృద్దే దేశ, రాష్ట్ర అభివృద్ధి అని నమ్మిన వ్యక్తినని తెలిపారు. ఇక ములుగు నుంచే పాలన కొనసాగిస్తానని, రాష్ట్రంలో ఉన్న గ్రామాలు అభివృద్ధి కోసమే తనకు పంచాయతీ రాజ్ శాఖ ఇచ్చారని తెలిపారు. ప్రగతి భవన్ ముందు పేదలకు అడ్డుగా ఉన్న ఇనుప కంచెలను తొలగించామని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. దానిలో రెండు ప్రారంభమయ్యాయని అన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపిటిసి, ఎంపి, జడ్‌పిటిసి, సింగిల్ విండో ఎన్నికల్లో ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని పార్టీ ప్రజా ప్రతినిధులకు హిత బోధ చేశారు. ఇందిరమ్మ రాజ్యపాలన చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు, అధికారులు, పత్రిక, మీడియా చేసే సూచనలను పరిగణలోకి తీసుకుంటూ వెలుగులోకి రాని వాటిని సైతం తెలుసుకొని పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్, పిసిసి కార్యదర్శి కూచన రవనీరెడ్డి. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఖానోత్ రవిచందర్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవియాదవ్, అధికార ప్రతినిధి అహ్మద్ బాషా, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికాన్ని గాడిలో ఎలా పెట్టాలి?

- ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్‌తో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అప్పుల కుప్పగా మారిన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక రంగాన్ని ఎలా గట్టెక్కించాలో చెప్పండంటూ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి రిజర్వుబ్యాంక్ (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురామరాజన్‌ను కోరారు. ఆర్థిక క్రమశిక్షణ, నూతన సంస్కరణల అమలు, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అంశాలను వివరించాలనీ అడిగారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కె రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు రఘురామరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్థికరంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఏఏ పథకాల కింద ఎలాంటి నిధులు వస్తాయి...వాటి వినియోగం...ఆడిట్ వంటి ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలను వారితో పంచుకున్నారు. పన్నుల సరళీకరణ, స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వంటి పలు అంశాలను ఆయన వారికి వివరించినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు అయ్యే ఖర్చు, వాటికి కేంద్రం నుంచి ఏవైనా మ్యాచింగ్ గ్రాంట్స్ వంటివి వస్తాయా... లేదా... వస్తే వాటిని ఎలా వినియోగించాలి వంటి పలు అంశాలను ఈ సందర్భంగా మంత్రులు రఘురామరాజన్‌ను అడిగి తెలుసుకున్నారు.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2
బెంగళూరు వారి సమక్షంలో
నం.1, 4వ అంతస్తు, టెలిఫోన్ హౌస్,
రాజ్‌భవన్ రోడ్, బెంగళూరు-560001.
ఓఎ నం.760/2021
బ్యాంక్ ఆఫ్ బరోడా, బానశంకరి బ్రాంచి
...దరఖాస్తుదారు
మరియు ఉదయ్ శంకర్ డి. మరియు ఇతరులు
...ప్రతివాదులు
మధ్య
పత్రికా ప్రకటన ద్వారా ప్రతివాదులకు ది డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్ 1993 యొక్క రూల్ 23 (8) క్రింద జారీచేయబడిన సమ్మన్స్
ప్రతివాదులు నం.3,4,6,7&8
టు, ప్రతివాది నం.3: శ్రీ నరేశ్ చంద్, తండ్రి కీ॥శే॥ మురళీలాల్, నివాసం: ఎస్-191, గ్రేటర్ కైలాష్ పార్ట్-1, న్యూఢిల్లీ-110048.
ప్రతివాది నం.4: శ్రీ అబ్దుల్ జమీల్, తండ్రి కీ॥శే॥ అబ్దుల్ జలీల్, నివాసం: నం.219, 3వ క్రాస్, 1వ బ్లాక్, కోరమంగళ, బెంగళూరు-560034.
ప్రతివాది నం.6: మెసర్స్ పృథ్వి బిల్డర్స్ & డెవలపర్స్, ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్, శ్రీ పి. శంకర్, ఆఫీసు: నం.29/2, రెండవ అంతస్తు, సేనాయిపిల్లై కాంప్లెక్స్, హులిమావు గేట్, బన్నేర్‌గట్ట రోడ్, బెంగళూరు-560070.
ప్రతివాది నం.7: శ్రీ ఫోటర్‌మల్ దినేశ్ కుమార్ జైన్, తండ్రి శివరాయ్, నివాసం: ఫ్లాట్ నం.503, 5వ అంతస్తు, చికోటి గార్డెన్, బేగంపేట్, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500 016.
ప్రతివాది నం.8: శ్రీమతి ఉర్మిలా జైన్, భర్త శ్రీ ఫోటర్‌మాల్ దినేశ్ కుమార్ జైన్, నివాసం: ఫ్లాట్ నం.503, 5వ అంతస్తు, చికోటి గార్డెన్, బేగంపేట్, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500 016.
ఏదైతే, దరఖాస్తుదారైన బ్యాంకు, ప్రస్తుత మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర రిలీఫ్స్‌తో రూ.41,30,306/- (రూపాయలు నలభై ఒక లక్షల ముప్పై వేల మూడు వందల ఆరు మాత్రమే)ల మొత్తాలను రికవరీచేయుట కొరకు మీపై రికవరీ ఆఫ్ ది డెట్స్ డ్యూ టు బ్యాంక్స్& బ్యాంక్రప్టసీ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 19 క్రింద దరఖాస్తు దాఖలుచేయబడినది. ఎందుకు రిలీఫ్ మంజూరుచేయకూడదో సూచిస్తూ, స్వయంగా లేదా ప్లీడర్/ అడ్వకేట్ ద్వారా కాని 01.02.2024న లేదా ముందుగా 10:30గం.లకు సమ్మన్స్ ప్రచురణ తేది నుండి 30 రోజుల్లోగా షో-కాజ్ కు ఇందుమూలంగా మిమ్ములను కోరబడుచున్నది.
హాజరగుటలో విఫలం చెందిన, ఇందు పై పేర్కొన్న తేదీన, ప్రొసీడింగ్స్ విని మరియు మీ గైర్హాజరులో అయినప్పటికీ తీర్పుచేప్పబడుతుంది.
గౌరవ ట్రిబ్యునల్ సీలువేసి నా స్వహస్తాలతో 20.11.2023న ఇవ్వబడినది.
ట్రిబ్యునల్, రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, బెంగళూరు వారి ఆదేశం ద్వారా.

ఉపగ్రహాలతో ఎన్నో ఉపయోగాలు

- చంద్రయాన్ విజయంలో శాస్త్రవేత్తల కృషి గొప్పది
- అంతరిక్ష జ్ఞానంపై విద్యార్థులను ప్రోత్సహించాలి
- ఎస్‌వికె వెబినార్‌లో రఘునందన్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతరిక్షంలో ప్రయోగిస్తున్న ఉపగ్రహాలతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్.రఘునందన్ కుమార్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంతో చంద్రయాన్ విజయం-శాస్త్రవేత్తల కృషి అనే అంశంపై నిర్వహించిన ఫేస్ బుక్ వెబినార్‌లో ఆయన మాట్లాడారు. తుపాను తదితర ప్రకృతి వైపరీత్యాల రాకను ముందే పసిగట్టి ప్రాణ నష్టాన్ని నివారించడంతోపాటు కమ్యూనికేషన్, వైద్యం, దేశ భద్రత తదితర వాటికి ఆ సాంకేతికతను విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. 1999లో వచ్చిన తుపానులో 10 వేల మంది చనిపోతే, ఇటీవల అలాంటి తుపాను వస్తే ముందస్తు హెచ్చరికలతో ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగారన్నారు. కారడవుల నుంచి కూడా ప్రత్యక్ష ప్రసారం ఇవ్వగలిగిన స్థితికి చేరుకున్నామని తెలిపారు. దీనికంతటికీ శాస్త్రవేత్తలు చేసిన కృషి గొప్పదనీ, ప్రభుత్వాలు మరిన్ని నిధులను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని కోరారు. ప్రపంచం 1957 నుంచి స్పేస్ యుగంగా భావిస్తుండగా, అదే సమయంలో కొంత మంది శాస్త్రవేత్తలు మన దేశాభివృద్ధికి ఖగోళ ప్రయోగాలు అవసరమని గుర్తించారని తెలిపారు. చంద్రయాన్ విజయంలో శాస్త్రవేత్తల కృషి గొప్పదన్నారు. చంద్రయాన్ 2 పూర్తిగా వైఫల్యం చెందిందని చెప్పలేమన్నారు. అది పంపించిన డాటా విశ్లేషణకు ఏండ్ల తరబడి సమయం పడుతుందని తెలిపారు. చంద్రయాన్ 3 విషయంలో సాఫ్ట్ ల్యాండింగ్ తోపాటు భారత శాస్త్రవేత్తలు మరో ప్రయోగాన్ని చేశారనీ, దానితో చంద్రమండలం పైకి వ్యోమగామిని పంపిం చేందుకు అవకాశాలపై ఆశలు చిగురించాయని తెలిపారు.

భవిష్యత్ సైంటిస్టులకు ప్రోత్సాహం

భవిష్యత్ సైంటిస్టులను ప్రోత్సహించేందుకు ఇస్రో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తున్నదని రఘునందన్ తెలిపారు. ప్రతి ఏడాది మార్చిలో నోటిఫికేషన్ ఇచ్చి 330 మంది విద్యార్థులను క్విజ్ ద్వారా ఎంపిక చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అంతిరక్ష జ్ఞానంపై అవగాహన కల్పించే కృషిని ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా గత 20 ఏళ్లుగా కొనసాగిస్తున్నదనీ, రాబోయే కాలంలోనూ ఇదే విధంగా కృషి చేస్తామని తెలిపారు. 2040 కల్లా వ్యోమగామిని చంద్రునిపైకి పంపించాలని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించిన నేపథ్యంలో మరో 17 ఏండ్లపాటు తమ ముందు మరింత బాధ్యత మిగిలి ఉందని తెలిపారు.

పబ్‌ల్లో పోలీసుల తనిఖీలు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని పలు పబ్‌ల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని అన్ని పబ్‌ల్లో తనిఖీలు చేస్తున్నారు. పబ్‌ల్లో డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు.. ఈ తనిఖీల్లో తొలిసారి పోలీసు జాగిలాలను రంగంలోకి దించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్న పోలీసులు కార్యాచరణ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

ఈసారైనా పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- కార్పొరేషన్ నుంచి వీడిన గ్రామాలకు పాలనా పగ్గాలపై సందిగ్ధం
- నేడు కలెక్టరేట్‌లో మంత్రి పొంగులేటి సమీక్షలో చర్చకొచ్చే అవకాశం
- ఆరు పంచాయతీలను 12గా విభజించడంపై మళ్లీ చిగురిస్తున్న ఆశలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవీ ఖమ్మం నగరానికి ఆనుకొని ఉన్న పంచాయతీలు. నగరానికి వీటికి మధ్య మున్నేరే అడ్డు. పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలోని ఈ పంచాయతీల్లో అభివృద్ధి సంగతి ఏమోగానీ.. అన్ని విషయాల్లోనూ అయోమయస్థితే నెలకొంది. కార్పొరేషన్ నుంచి ఈ పంచాయతీలను విడగొట్టి ఏళ్ల గడుస్తున్నా వీటికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడం గమనార్హం. ఫిబ్రవరిలో పంచాయతీల పదవీకాలం పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్వహించే ఎన్నికలనాటికైనా ఈ పంచాయతీలను ఒక్కోదాన్ని రెండుమూడుగా విభజిస్తామన్న హామీపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఎన్నికల లేక.. మౌలిక వసతులకు నోచుకోక..

ఖమ్మం రూరల్ మండలంలో గతంలో కార్పొరేషన్‌లో విలీనం చేసిన పెద్ద పంచాయతీలను తిరిగి విలీనం నుంచి బయటకు తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు జరిగే సమయంలో ఇవి ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఉండటంతో పంచాయతీ ఎన్నికలు ఈ గ్రామాల్లో నిర్వహించ లేదు. రాష్ట్ర పురపాలక సంఘాలకు ఎన్నికలు జరిగే సమయంలో వీటిని కార్పొరేషన్ నుంచి వేరుచేయడంతో మున్సిపల్ ఎన్నికలకు ఈ ఆరు పంచాయతీలు దూరమయ్యా యి. తద్వారా గత ఐదారేండ్లుగా ఈ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ పంచాయతీలు స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ (సుడా) పరిధిలో ఉండటంతో వీటిలో వసూలైన పన్నులను గత ప్రభుత్వం ఈ గ్రామాల అభివృద్ధికి కాకుండా సుడా అర్బన్ డెవలప్‌మెంట్ పార్కులు, ఇతరత్రా పనులకు వెచ్చించడంతో వీటి అభివృద్ధి కుంటుపడింది. కనీస మౌలిక వసతులకు కూడా ఈ గ్రామాలు నోచుకోకపోవడంతో మున్నేరు వరదల సమయం లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. డ్రయినేజీలు, సిసి రోడ్లు కూడా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే వీధులు బురద మయం అవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాలేరు నియోజకవర్గంలో ఉన్న వీటిని ఒక్కొక్కదానిని ఓటర్ల సంఖ్య ఆధారంగా రెండు, మూడు పంచాయతీలుగా విభజించి, పాలకవర్గాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ తలెత్తుతోంది. సోమవారం పాలేరు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష చేయనున్న దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం, పాలనా సౌలభ్యం కోసం ఈ పంచాయతీలను విభజించే అంశంపై చర్చించాలని సంబంధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరు పంచాయతీలను 12గా విభజించాలని డిమాండ్..

పాలేరు నియోజకవర్గం పరిధిలోని ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, ఏదులాపురం (8,691), పెద్దతండా (11,128), వెంకటగిరి (2,091), గుర్రాలపాడు (1,408), గుదిమళ్ల (3,188), పోలేపల్లి (3,528) పంచాయతీల్లో 30వేలకుపైగా ఓట్లు ఉన్నాయి. దాదాపు 50వేల జనాభా ఉంది. ఈ పంచాయతీలను నగర పాలక సంస్థలో విలీనం చేసినప్పుడు ఏడు డివిజన్లుగా మార్చారు. ఒక్కో డివిజన్‌ను మూడు వేలకుపైగా ఓట్ల ఆధారంగా విభజించారు. కనీసం వెయ్యి ఓట్లుంటే ఓ పంచాయతీగా ఏర్పాటు చేస్తున్న తరుణంలో 30వేలకు పైగా ఓట్లున్న ఈ పంచాయతీలను 12 పంచాయతీలుగా విభజించాలని డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. దీనిపై గత ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గెజిట్ రాలేదనే కారణంతో ఏళ్ల తరబడి ఈ అంశాన్ని పెండింగ్‌లో ఉంచారు. దాదాపు ఏడాది క్రితం గెజిట్ వచ్చినా ఎలాంటి పురోగతి లేదు. కొత్త ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందని ఈ ప్రాంతవాసులు ఆశిస్తున్నారు.

వామన్‌రావు దంపతుల హత్యపై విచారణ జరిపిస్తాం

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సంచలనం సష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణిల హత్యలపై విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి మంథనికి శ్రీధర్‌బాబు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "హత్యా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చారు. అడ్వకేట్ వామన్‌రావు దంపతుల హత్యలో ప్రత్యక్ష, పరోక్ష పాత్రధారులపై కచ్చితంగా విచారణ చేయిస్తాం. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తాం. ప్రస్తుతం రాష్ట్ర ఖాజానా ఖాళీగా ఉంది. ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయం సమకూర్చుకుని అభివద్ధి, సంక్షేమం అందిస్తాం" అని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

IN THE COURT OF THE HON'BLE
III ADDL. CHIEF JUDGE, CITY
CIVIL COURT AT: HYDERABAD
O.S.NO. 630 of 2019
Between:
Mohammed Abdul Basith,
S/o. Late Abdul Razzak,
A/a. 50 years,Occ:Business,
R/o. 5-6-265/266, Aghapura,
Hderabad, Telangana state.
...Plaintiff
AND
Mitta Sanjeeva Reddy
...Defendant
To,
Mitta Sanjeeva Reddy S/o.Late Bala Koti Reddy, A/a.42years,Occ:Business, R/o.H.No.1-154,Papyi Pally, Besthavari Peta, Prakasham Dist., Presently Residing at: 5-6-335, &,5-6-336/1, Aghapuras Road, Nampally, Hyderabad, Telanaga State.
...Defendant
the above named plaintiff filed the above suit for Mandatory Injunction with relief of perpetual injunction and the above named defendant is avoiding the service of summons are such the Hon'ble court ordered for paper publication and the date is posted to 29/12/2023 at 10.30 am as such the defendant may appear either in person or through pleader otherwise the matter will be decide according to law.
M/S. MIRZA SULEMAN BAIG
ADVOCATE AND ASSOCIATES
#No. 12, 3rd FLOOR , Sanali Mall,
Opp: Chermas & Grammer School,
ABIDS, HYDERABAD.
CELL: 9440732060

గురుకుల ఉపాధ్యాయుల ఐక్య వేదిక ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఒకే గొడుగు కిందికి చేర్చుతూ గురుకుల ఉపాధ్యాయుల ఐక్య వేదిక ఏర్పాటు చేశారు. ఆదివారం నారాయణ గూడలోని పిఆర్‌టియు భవన్‌లో జరిగిన సంయుక్త సమావేశంలో అనుబంధంగా రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా. దిలీప్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎ నరేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం వేణు ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనార్టీ గురుకుల కన్వీనర్‌గా పానుగంటి విజయ్‌కుమార్, కో కన్వీనర్‌గా సిహెచ్. లక్ష్మారెడ్డి, బిసి గురుకుల కన్వీనర్‌గా బి గట్టయ్య, కో కన్వీనర్‌గా ఆర్ రాజ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ గురుకుల కన్వీనర్‌గా ఎం నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా ఓరుగంటి నవీన్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు అభినందించారు.

సిద్దిపేట రైతుల సమస్య పరిష్కరించండి

- మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా రైతాంగ సమస్యను పరిష్కరించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం లేఖ రాశారు. గత మూడేళ్లుగా సిద్దిపేట జిల్లా భూములకు రంగనాయక సాగర్ ద్వారా సాగు నీరు అందజేశామని, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటకు సరిపోయే నీరు రిజర్వాయర్‌లో లేక రైతాంగం ఆందోళనకు గురవుతోందన్నారు. యాసంగికి నీళ్ల అందించాలంటే కనీసం 3 టిఎంసిల నీరు ఉండాలి.. కానీ ప్రస్తుతం రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో 1.50 టిఎంసీల నీరు మాత్రమే ఉందని చెప్పారు. రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని వెంటనే మిడ్ మానేరు నుంచి 1.50 టిఎంసిల నీరు రంగనాయక సాగర్‌కు పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

శబరిమల యాత్రలో అపశృతి

- ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శబరిమలై వెళ్లి మొక్కులు తీర్చుకుని ఇంటికి తిరుగుముఖం పట్టిన స్వాములు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మలుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఐదుగురు స్వాములు తలారి సుబ్బయ్య నాయుడు (52), నర్ర సాంబయ్య (55) నిమ్మల వెంకట్రాజు (49), కునారపు అజయ్, జరుపుల రాములు మాల విరమణకై గత గురువారం కారులో శబరిమలైకు వెళ్లి అదే కారులో ఆదివారం కమలాపురం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తమిళనాడు వద్ద వారి కారు అదుపుతప్పి కాల్వర్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సుబ్బయ్య నాయుడు, సాంబయ్య, వెంకట్రాజు అక్కడికక్కడే మృతి చెందారు. అజయ్, రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించడంతో కమలాపురం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. సామాజికవేత్త, హ్యూమన్ రైట్ సభ్యులు అయిన సుబ్బయ్య నాయుడు మరణం పట్ల మండలంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి

- అందరి బాధా తన బాధే
- ఎంఎకె దత్తు సంస్మరణ సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్

అందరి బాధ తన బాధగా భావించి చివరికంటూ ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమంలో ఎంఎకె దత్తు క్రియాశీలక పాత్ర పోషించారని, ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి అని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన ఎంఎకె దత్తు సంస్మరణ సభ నిర్వహించారు. సభలో రాఘవులు మాట్లాడుతూ తన బాధలను అందరికీ పంచాలనుకోలేదని, అందరి బాధల్లో తాను పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. అదో ఉదాత్తమైన లక్షణమన్నారు. మరణం అనివార్యమైనప్పటికీ.. బతికిన కాలంలో దత్తు అసమానతలు లేని సమాజం కోసం పనిచేశారని గుర్తు చేశారు. ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడని, అంకిత భావం కలిగిన నాయకుడని కొనియాడారు.

ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమానికేగాక అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు. తన దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించటం ద్వారా మరణించాక కూడా వైద్య విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ అసమాన ప్రతిభాశాలి,



కెకె దత్తు సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న బివి రాఘవులు తదితరులు

అవిశ్రాంత ఉపాధ్యాయుడు దత్ అని కీర్తిస్తూ నివాళులర్పించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ఒక మంచి సహచరుడిని కోల్పోయాననీ, ఆయనతో మాట్లాడటమే ఒక విజ్ఞానం అని గుర్తుచేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ విద్యార్థి దశనుండి నేటివరకు దత్‌తో తనకు గల అనుబంధాన్ని వివరించారు.

లౌకిక, ప్రజాస్వామిక విలువలకు తుదివరకు కట్టుబడి పనిచేశారని తెలిపారు. అలాంటి వ్యక్తుల అవసరం ఇప్పుడు చాలా ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడి నుంచి సాధారణ కార్యకర్తల వరకు ఏ స్థాయిలో తన అవసరం ఉంటే ఆ స్థాయికి దిగి పనిచేయగలిగిన సమర్థుడు ఎంఎకె దత్ అని గుర్తు చేశారు. జీవితం చివరి శ్వాస వరకు ఉద్యమంలో మమేకమయ్యారని నివాళులర్పించారు. తొలుత దత్ చిత్రపటానికి రాఘవులు, నర్సిరెడ్డి, దత్ భార్య లలిత తదితరులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎస్ పుణ్యవతి, పాలడుగు భాస్కర్, ఎం సంయుక్త, టి జ్యోతి, పి కృష్ణమూర్తి, ఎస్ వేణుగోపాల్, వి నాగేశ్వరరావు, జి నాగేశ్వరరావు, పి మాణిక్ రెడ్డి, కె పార్థసారధి, బి రవికుమార్, స్కైలాబ్ బాబు, పద్మశ్రీ, రాధేశ్యామ్, ప్రమోద్, మస్తాన్ రావు, జి బుచ్చిరెడ్డి, సత్యానంద్, గాలయ్య, జ్ఞానమంజరి, కె రవికుమార్, సింహాచలం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

వారంలో భద్రాద్రి వంతెన పనులు ప్రారంభించాలి

- అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వారం రోజుల్లో భద్రాచలం వద్ద వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనుల ప్రగతిపై ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలోని ఐటీసీ విశ్రాంతి భవనంలో జాతీయ రహదారుల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపిలోని విజయవాడ ఇబ్రహీంపట్నం నుంచి భద్రాచలం వరకు 165 కి.మీ రహదారిగా ప్రకటించినట్టు గుర్తుచేశారు. రూ.వెయ్యి కోట్లతో చేపట్టిన పనులను 2015లో నితిన్ గడ్కరీతో కలిసి తాను శంకుస్థాపన చేశానన్నారు. కానీ 2015 నుంచి 2023 వరకు వంతెన పనులు జరుగుతూనే ఉన్నాయని, రానున్న ఫిబ్రవరి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాసాంతం వరకు వంతెన పనులు ఏ మాత్రం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనులపై మంత్రి ఫోన్ ద్వారా ఇఎన్‌సి గణపతి రెడ్డి, భారత ప్రభుత్వ జాతీయ రహదారుల విభాగం ప్రాంతీయ మేనేజర్ కుష్వాలతో మాట్లాడి తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తాను మాట్లాడతానని, ఎట్టి పరిస్థితుల్లో ఈ వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ ఇఇ యుగంధర్, డిఇ శైలజ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఒ పిడిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు

- ఆధారాలు ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండేళ్లుగా ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం కాళిందినిపై నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త, ప్రజా దర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాగా ఫిర్యాదుపై త్వరలో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌సెల్ నుంచి ఆదివారం సామాజిక కార్యకర్తకు రిప్లై వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిఆర్‌డిఒ పిడి కాళిందిని విధుల నిర్వహణలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలకు సంబంధించిన కథనాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయని, ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. పిఆర్ అండ్ ఆర్‌డి ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎసిబి, సిబిఐ, ఇడిలకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా డిప్యూటేషన్ పేరుతో జిల్లాకు వచ్చిన పిడి కాళిందిని డిఆర్‌డిఒలో తిష్ట వేసి ప్రయివేటు సంస్థలతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బైరుసన్ సంస్థతో వ్యాపారాలను ఎస్‌హెచ్‌జి, విఒ, ఎంఎస్ సభ్యులతో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పి మహిళా సంఘాలను మోసం చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా అక్రమ డిప్యూటేషన్లు, సిబ్బందిపై వేధింపులు, ధాన్యం కొనుగోళ్లలో అవినీతి తదితర అంశాలపై ఫిర్యాదు చేస్తూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. జిల్లా మహిళా సమైక్యకు సంబంధించి రూ.14,72,576 తన సొంత ఖాతాలోకి మళ్లించారని చెప్పారు. విషయంపై సేర్ప్ డైరెక్టర్ స్థాయి అధికారి విచారణ చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నత అధికారిని నియమించి విచారణ చేయించాలని, తగిన ఆధారాలు ఉన్నందున వెంటనే పిడిని సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఫిర్యాదు లేఖలో కోరినట్టు తెలిపారు.

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్ ?

- కొత్త సర్కారు తొలి భేటి
- ఆరు గ్యారంటీలు, ధరణి, రైతుబంధు, భూసమస్యలపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కొత్త సర్కారు ఈనెల 21న కలెక్టర్ల సమావేశం నిర్వహించనుంది. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, సీనియర్ ఐఎఎస్‌లు, ఇతరులు ఈ సమావేశానికి రానున్నారు. ఇందులో సిఎం రేవంత్ రెడ్డితో పాటు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర మంత్రులతోపాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డిజిపి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఇతరులు పాల్గొననున్నారు. ఇందులో ప్రభుత్వ లక్ష్యాలు, అమలు, సర్కారీ యంత్రాంగం సహకారం తదితర అంశాలపై చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే ఆరు గ్యారంటీలపైనా చర్చ జరగనుంది. ఇప్పటికే ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం రూ. 10 లక్షలకు పెంచింది. వీటిని అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే అమలుచేసినట్టుగా రేవంత్ సర్కారు ప్రకటించింది. అలాగే మిగతా అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించింది. ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి నుంచే ప్రజాభవన్‌లో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికి వస్తున్న ఫిర్యాదులు భారీగానే ఉంటున్నాయి. వీటి పరిష్కారం కోసం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం, మంత్రులు గట్టిగానే చెప్పే అవకాశాలు ఉన్నాయి. భూములు, ధరణి, పౌరసరఫరాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజావాణిలో అధికంగా వెల్లువెత్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేస్తామని ఇప్పటికే ప్రకటించిన రేవంత్, కలెక్టర్ల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటిస్తారా? లేదా ఇంకొన్ని రోజులు వేచి చూస్తారా? అనేది తేలాల్సి ఉంది. తొలి అసెంబ్లీ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాలు ఢీ అంటే ఢీ అనేవిధంగా వ్యవహరించాయి. బిఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలపై కాంగ్రెస్ అధికార పక్షం, రేవంత్ సర్కారు రూపొందించిన గవర్నర్ ప్రసంగంపై బిఆర్‌ఎస్ పరస్పరం టార్గెట్ చేసుకున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లల్లో పరిస్థితి ఇలా ఉంటే, భవిష్యత్‌లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా ఉండొచ్చనే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ఇదిలావుండగా రైతుబంధుపై మాట్లాడే పరిస్థితి ఉంది. రైతుబంధుకు నిధులు విడుదల చేయాలని రేవంత్ సర్కారు ఆదేశించినా, నిధులు లేక పూర్తిస్థాయిలో అమలుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. దీనిపైనా చర్చించే అవకాశం లేకపోలేదు.

రైతుల పత్తి కొనుగోలుకు సిసిఐ అనాసక్తి

- వ్యాపారుల పత్తి కొనుగోలుకు పెద్దపీట
- పంటల సాగు సర్వేలో అధికారుల ఇష్టారాజ్యం
- ఆన్‌లైన్‌లో నమోదు కాలేదంటూ కొనుగోలుకు నిరాకరణ
- మిల్లర్లు, అధికారులు, సిసిఐ, వ్యాపారులు సిండికేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కాస్త ఛీసిఐగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాల్సిన సిసిఐ.. వ్యాపారులకు మద్దతు ధరిచ్చి కొంటోంది. పంటల సాగు సర్వే రిపోర్టులను అధికారులు ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల రైతులు తమ పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. వ్యవసాయ అధికారులు, సిసిఐ, వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తి రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వీలులేక అడ్డికిపావుసేరు అన్నట్టుగా తక్కువ ధరకే విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి కంటే పత్తినే అధికంగా సాగవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 348946 ఎకరాల్లో, మెదక్ ఇజల్లాలో 50 వేల ఎకరాల్లో సిద్దిపేట జిల్లాలో 355000 ఎకరాల్లో పత్తి సాగైంది. మూడు జిల్లాల్లోనూ పత్తిని ఏరి అమ్ముకుంటున్నారు. వ్యవసాయ మార్కెట్లు, జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసినందున పత్తి దిగుబడులు ఆశించిన మేరకు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కనిష్టంగా ఎనిమిది క్వింటాళ్లు గరిష్టంగా 11 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటు దిగుబడి అంచనా మేరకు 60 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు మార్కెట్‌కు వస్తాయని మార్కెటింగ్ శాక అంచనా వేసింది.

పంట సాగు సర్వేలో తప్పిదాలు

ఖరీఫ్ సీజన్‌లో ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో సాగవుతున్నాయనే వివరాల్ని సేకరించేందుకు వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. జిల్లా, మండల వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి ప్రతి ఒక్క రైతు పొలాలకు వెళ్లి ఏఏ రకం పంట.. ఎన్నిక ఎకరాల్లో సాగు చేశారనే వివరాల్ని సేకరించారు. ఫొటోలు తీశారు. సర్వే వివరాల్ని మండలాలు, గ్రామాల వారిగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా సర్వే వివరాల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలోనే పెద్ద ట్విస్ట్ ఉంది. పత్తి పంట సాగు చేసిన రైతుల పేరిట వాస్తవ ఎకరాల్ని కాకుండా తక్కువ నమోదు చేశారు. ఎందుకంటే ఆ రైతులు సీసీఐ కేంద్రాలకు పత్తిని తెచ్చి అమ్ముకుంటే వ్యాపారుల నుంచి పత్తిని కొనుగోలు చేయడం వీలుకాదు. అందుకే సర్వే రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడే వాస్తవ రైతులు సాగు చేసింది తక్కువ చూపి సాగు చేయని వ్యాపారుల బినామీ రైతుల పేరిట ఎక్కువ సాగు అయినట్టు చూపారు. ఎందుకంటే వ్యవసాయ శాఖ సర్వే చేసిన నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆ రిపోర్టును మార్కెటింగ్ శాఖకు ఇవ్వాలి. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేసే సమయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు.. ఆన్‌లైన్‌లో రైతుల పేరిట ఎన్ని ఎకరాలుంటే అందులో పండిన పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తారు. ఎకరాకు కనీసం 12 క్వింటాళ్ల వరకు సీసీఐ కొనుగోలు చేసే అవకాశముంది. అధికారుల తప్పుడు లెక్కల వల్ల నిజమైన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు, ఎఈఓ బృందం సర్వే చేసింది. ఆ గ్రామానికి చెందిన సంగారెడ్డిగారి మాణిక్‌రెడ్డి నాలుగెకరాల్లో పత్తి సాగు చేశారు. ఆయన భార్య పేరిట ఉన్న రెండెకరాల్లోనూ పత్తి సాగు చేశారు. వీరిద్దరి రైతులు సాగు చేసిన పత్తి పైరును స్వయంగా జిల్లా వ్యవసాయ అధికారి సర్వే చేసి రాసుకున్నారు. తీరా పత్తిని తీసుకుని సదాశివపేట మార్కెట్‌కు పోతే.. వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో మాణిక్‌రెడ్డి పేరిట కేవలం ఐదు గుంటల భూమిలోనే పత్తి సాగు చేసినట్టు ఉంది. దీంతో పత్తిని సిసిఐ కొనుగోలు చేయడానికి నిరాకరించింది. దీంతో ఆ రైతు పత్తిని తిరిగి ఇంటికి తీసేకెళ్లాడు. రెండు వేలు ట్రాక్టర్ కిరాయి నష్టపోయాడు. ఇలానే చాలా మంది రైతుల సాగు వివరాల్ని తక్కువ నమోదు చేయడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆందోళన చేస్తున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పత్తిని సాగు వివరాలు లేవని నిరాకరించడంతో అంత దూరం తీసుకెళ్లిన పత్తిని ఇంటికి తీసుకురాలేక అక్కడే తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. సిసిఐ కొనుగోలు కేంద్రాల పక్కనే గుజరాత్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు, స్థానిక దళారులు కొనుగోలు కేంద్రాలు పెట్టారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

వ్యాపారుల పత్తి కొంటున్న సిసిఐ

రైతులు తెచ్చిన పత్తిని కొనాల్సిన సిసిఐ అధికారులు వ్యాపారుల పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సాగు చేసిన రైతులు పండించిన పత్తిని తీసుకుని మార్కెట్‌కు వస్తున్నారు. వారి పేరిట సాగు వివరాలు ఆన్‌లైన్‌లో తక్కువ నమోదైందని నిరాకరిస్తున్నారు. దీంతో వ్యాపారులు కొంత మంది బినామీ రైతుల పేర్లు ముందే నమోదు చేయించుకున్నారు. క్వింటాల్ పత్తికి కనీస మద్దతు ధర రూ.7020 సిసిఐ కొంటుంది. బినామీ రైతుల పేరిట వ్యాపారులు లారీల కొద్దీ పత్తిని తెచ్చి సిసిఐకి అమ్ముతూ అదనపు ధర పొందుతున్నారు. ఇదే వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.6300కు కొనుగోలు చేస్తున్నారు. అదే పత్తిని సిసిఐ కేంద్రాలకు తెచ్చి అదనంగా వెయ్యి రూపాయల లాభం పొందుతున్నారు. వ్యాపారులు బినామీ రైతుల పేరిట పత్తిని తెచ్చి అమ్ముతుంటే మార్కెట్ అధికారులు, సిసిఐ అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. హత్నూర, సదాశివపేట, అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్, గజ్వేల్, చేర్యాల, తూప్రాన్, దుబ్బాక, హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో పత్తి కొనుగోళ్లలో సిసిఐ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పత్తికి మద్దతు ధర ఇవ్వాలి

యాదవ్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రైతులు తెచ్చిన పత్తిని మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. సిసిఐ, పత్తిమిల్లు యజమానులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల్ని దోపిడీ చేస్తున్నారు. రైతుల నుంచి వ్యాపారులు రూ.6300కే కొనుగోలు చేసి అదే పత్తిని సిసిఐకి మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నా మార్కెటింగ్ అధికారులు, తప్పుడు తూకం వేస్తున్నా తూనికలు కొలతల అధికారులు తనిఖీలు చేయట్లేదు. పత్తి రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చి తెచ్చిన పత్తిని ఎలాంటి షరతుల్లేకుండా కొనాలి.

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము శీతాకాల విడిదికి సోమవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి రానున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. ఈ నెల 18న సాయంత్రం 6:25 గంటలకు రక్షణ శాఖ పరిధిలోని హకీంపేట వైమానిక దళ శిక్షణ కేంద్రానికి రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. అక్కడి నుంచి బొల్లారం నిలయంలోకి 7 గంటలకు ప్రవేశించనున్నారు. ఆయా మార్గాల్లో రాష్ట్రపతి కాన్వాయ్‌కు సంబంధించి అధికారులు శనివారం రిహార్సల్ నిర్వహించారు. సైబరాబాద్ సిపి ఎకె మహంతి ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా ఉన్న నివాసాలపై ఇప్పటికే పోలీసు, ఇంటిలిజెన్స్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి విడిది కాలంలో లోతుకుంట నుంచి ఆంక్షలు అమలు చేయనున్నారు. సోమవారం సాయంత్రం హకీంపేట విమానాశ్రయం నుంచి వై జంక్షన్, బొల్లారం జంక్షన్, నేవీ జంక్షన్, యాప్రాల్ రోడ్డు, బైసన్ గేట్, లోతుకుంట జంక్షన్ వైపు వచ్చే వాహనాలను మళ్లించనున్నట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

ఇంటర్ విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత విద్యా రంగంలో కీలకమయిన ఇంటర్ విద్యారంగం అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని చెన్నుపాటి భవన్‌లో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు బాధ్యతగా పనిచేసి సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. క్రమబద్ధీకరణకాని కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. డాక్టర్ అందె సత్యం మాట్లాడుతూ అధ్యాపకులు సమాజానికి మోడల్‌గా ఉండాలన్నారు. సమాజంలోని సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. సమావేశంలో టిజిజెఎల్‌ఏ475లోగా అవిష్కరణతోపాటు క్రమబద్ధీకరణ కాని కాంట్రాక్టు అధ్యాపకులందిరినీ రెగ్యులర్ చేయాలనీ,ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ప్రవేశపెట్టాలంటూ పలు తీర్మానాలు చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ వి శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ జె కుమారస్వామి, పి శోభన్‌బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె సురేశ్, కోశాదికారి ఎన్ శ్రీనివాస్‌తో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు,నలుగురు కార్యదర్శులు, ఐదుగురు మహిళా కార్యదర్శులను ఎన్నుకున్నారు.

జట్టుగా పనిచేద్దాం

- బాధ్యతలు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో



పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం ప్రజలు, అటవీశాఖ అధికారులు కలిసి జట్టుగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్ గ్రేషియా పెంపు ఫైల్‌పై తొలిసంతకం చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యకలాపాలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పథకాలు, పనులపై అటవీ సంరక్షణ అధికారి ఆర్.ఎం. డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఆయా శాఖలు ఉన్నతాధికారులు మంత్రికి అభినందనలు తెలిపారు.

వ్యవసాయానికి ఉపాధిని అనుసంధానం చేయొద్దు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహనరెడ్డి తీర్మానం అర్థరహితం
- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు

ప్రజజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ పనులకు గ్రామీణ ఉపాధిని అనుసంధానం చేస్తామంటూ కాంగ్రెస్ శాసనసభ్యులు టి రామ్మోహనరెడ్డి ప్రకటనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పిని పద్మ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా యుపిఎ ప్రభుత్వం వ్యవసాయ పనులు లేని సందర్భంలో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించడం కోసం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చారనీ, వంద రోజుల పనిని గ్యారెంటీ చేశారని తెలిపారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయడమంటే వ్యవసాయ కూలీల కడుపు కొట్టడమేనని తెలిపారు. చట్టంలో అనేక పనులు వ్యవసాయానికి అనుబంధంగా ఉన్నాయనీ, వాటిని అమలు చేయకుండా గత పాలకులు తొక్కిపట్టారనీ, కాంగ్రెస్ ప్రభుతం అమలు చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిల బీడు భూములు సాగులోకి తీసుకురావడం, చిన్నచిన్న చెక్ డ్యాములు, కాలువల నిర్మాణం చేపట్టడం వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిర జలప్రభ కింద బోర్లు వేయడం, బావులు తీయడం చేశారని పేర్కొన్నారు. చౌడు భూములకు, ఒండ్రు మట్టి ఉపాధి జాబ్ కార్డు కలిగిన చిన్న సన్నకారు రైతుల భూములకు ఫ్రీగా తోలే పనిని చేపట్టాలని డిమాండ్ చేశారు. పశవులకు పచ్చని బైళ్లను పెంచే పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే పనుల అమల కోసం చట్టంలో ఉన్న అవకాశాలను ఉపయోగించుకునే పద్ధతిలో ప్రణాళికలు రూపొందించడం కోసం వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థలతో వర్క్ షాప్ నిర్వహించాలని కోరారు.

అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

- సిఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయ పార్టీలను భాగస్వాములను చేయాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అఖిలపక్షం నిర్వహించాలని గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. గత అనవాయితీని బిఆర్‌ఎస్ సర్కారు పెడచెవిన పెట్టిందని విమర్శించారు. విద్యుత్, పెండింగ్ ప్రాజెక్టులు, అప్పులు, నిరుద్యోగంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వ లోపాలు, చేసిన తప్పులు, రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించాల్సి ఉందని తెలిపారు. తెలంగాణ ప్రజల సమగ్రాభివృద్ధి కోసం ఈ ప్రభుత్వం ఏమి చేయాలో, ఏమి చేయకూడదో పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్న వారితోపాటు ప్రాతినిధ్యంలేని పక్షాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేరళ రాష్ట్రంలో ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో అఖిలపక్షాల సమావేశం నిర్వహించి ఆదర్శంగా నిలవాలని జూలకంటి కోరారు.